సాక్షి
రంగారెడ్డి
గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



గౌడలు రాజకీయంగా ఎదగాలి

గౌడ కులస్తులు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేందర్‌గౌడ్ అన్నారు. 8లో▸

క్యాబ్ డ్రైవర్ల మెరుపు సమ్మె

శంషాబాద్: ఓలా, ఉబర్ క్యాబ్‌లు నడిపిస్తున్న సుమారు 2 వేల మంది డ్రైవర్లు ఎయిర్‌పోర్టులోని క్యాబ్ ఏరియాలో బుధవారం మధ్యాహ్నం మెరుపు సమ్మెకు దిగారు. అధిక మొత్తంలో కమీషన్, ఇష్టారీతిన జీఎస్‌టీ తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓలా, ఉబర్ సంస్థలు అడ్డగోలుగా తీసుకుంటున్న కమీషన్‌లతో పాటు పన్నులను తగ్గించాలని తెలంగాణ జిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌సలావుద్దీన్ డిమాండ్ చేశారు.

'డబుల్ డెక్కర్'కు చార్జింగ్ పాయింట్లు

ఖైరతాబాద్: నగరంలో విద్యుత్‌తో నడిచే డబుల్ డెక్కర్ బస్సులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సాగర తీరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫార్ములా ఈ- రేసింగ్ నేపథ్యంలో ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ఇవి ఆకట్టుకోనున్నాయి. వీటికోసం నెక్లెస్ రోడ్డులోని 20 ఎంఎల్‌డీ హెచ్‌ఎండీఏ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో రెండు చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్ష



కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో జిల్లా మత్స్యశాఖఅధికారి సుకీర్తి ఆధ్వర్యంలో బుధవారం ముదిరాజ్ మత్స్యకారుల పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు కోసం వృత్తి నైపుణ్య పరీక్ష నిర్వహించారు. 45 మందికి నల్ల చెరువులో చేపల వేట కోసం వల విసరడం, ఈదడం వంటి పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన 42 మందికి సంఘంలో ప్రాతినిధ్యం కల్పించారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం మంచాల మండల అధ్యక్షుడు తలారి సతీష్, కందుకూరు మండల సంఘం యూత్ ప్రధానకార్యదర్శి ఉదయ్‌ముదిరాజ్, మాధురాపూర్ ఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు బైరమోని సతీష్‌ముదిరాజ్, నేదునూరు చీఫ్ ప్రమోటర్ పోలెమోని శ్రీశైలంముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గిరిజన గురుకుల వికారాబాద్ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ తెలిపారు. ఈ నెల 5వ తేదీతో ముగిసిన గడువును 11 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. అర్హులైన మహిళా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమ బదిలీలను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలను అరికట్టాలని, అక్రమ బదిలీలను రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏర్పుల గాలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఒక పాఠశాల నుంచి దగ్గరగా ఉన్న మరో పాఠశాలకు కూడా ఆర్డర్స్ తెచ్చుకొని సుదూర ప్రాంతంలో పని చేస్తున్న వారికి అవకాశాలు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. అక్కడున్న వారికి పదోన్నతుల్లో నష్టం జరుగుతోందని తెలిపారు. నిరుద్యోగులకు ఖాళీ పోస్టు లేకుండా పోయి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ అన్యాయాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, కోశాధికారి జగన్నాథ్ శర్మ, నాయకులు వెంకటయ్య, బుగ్గరాములు, నర్సింహగౌడ్, రాములయ్య, భువనేశ్వరి, కల్పన, సుగంధ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులు

తుక్కుగూడ: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు సెర్ప్ ఉద్యోగులకు ఇస్తున్న పే స్కేల్‌ను వర్తింప చేయాలని ఉపాధిహామీ పథక ఉద్యోగ జేఏసీ చైర్మన్ నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరీశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ.. 17 సంవత్సరాల నుంచి గ్రామీణాభివృద్ధిలో పని చేస్తున్నా పేస్కేల్ లేదన్నారు. పే స్కేల్ అమలు చేయడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు చరణ్ గౌతమ్, ప్రధాన కార్యదర్శి తిరుపతిచారి తదితరులు పాల్గొన్నారు.

వంట.. ఎలా తినేదంట!

'మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్‌లోనూ పప్పు కూరలకు బదులు కారం పొడి వడ్డిస్తున్నారు. ఘాటుకు కడుపులో మంట పుడుతోంది. అర్థాకలితో అలమటిస్తున్నాం. దాహమేస్తే తాగేందుకు సరిపడా తాగునీరు కూడా అందుబాటులో ఉండటం లేదు. అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవుతున్నాం. ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తే .. హాస్టల్ సిబ్బంది మాపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు' ఇదీ ఫరూఖ్‌నగర్ మొగిలిగిద్ద కేజీబీవీ వసతి గృహంలో చదువుతున్న ఓ విద్యార్థిని ఇటీవల కలెక్టర్, మండల విద్యాశాఖ అధికారికి లిఖిత పూర్వకంగా చేసిన ఫిర్యాదు.



ఫరూఖ్‌నగర్ మొగిలిగిద్ద కేజీబీవీలో కూరలకు బదులు వడ్డించిన కారం పొడి

- ముక్కిన బియ్యం.. పుచ్చిపోయిన కూరగాయలు
- నీళ్ల చారును తలపించే పప్పు, సాంబారు
- కారం మెతుకులతో కడుపు నింపుకొంటున్న విద్యార్థులు
- తరచూ అస్వస్థత.. ఆస్పత్రులకు పరుగులు
- మొన్న ఫరూఖ్‌నగర్.. తాజాగా మంచాల వసతిగృహాల్లో ఘటనలు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నిరుపేద విద్యార్థులకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కేజీబీవీ హాస్టళ్లు అధికారుల పర్యవేక్షణ లోపం...సిబ్బంది నిర్లక్ష్యం...కాంట్రాక్టర్ల కక్కుర్తితో అభాసుపాలవుతున్నాయి. తమ పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు మూడు పూటలా కడుపునిండా భోజనం లభిస్తుందనే ఆశతో చాలా మంది పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను కేజీబీవీల్లో చేర్పించారు. మెనూకు భిన్నంగా ఆహారం వడ్డిస్తుండటంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. మూడు రోజుల క్రితం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద కేజీబీవీలో 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా, తాజాగా మంచాల మండల కేంద్రంలోని కేజీబీవీలో పది మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలయ్యారు. ఎప్పటికప్పుడు ఆయా వసతి గృహాలను సందర్శించి, కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్న గుడ్లు, చికెన్, కాయకూరలు, పప్పు, ఉప్పు, కారం సహా ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. రాత్రి మిగిలిన అన్నాన్నే ఉదయం తాలింపు చేసి వడ్డిస్తున్నారు. పులిసిపోయి, పుచ్చిపోయిన కాయగూరలతో నీళ్లచారును తలపించే కూరలతో ఫుడ్‌పాయిజన్ అవుతోంది. రుచీపచీలేని ఆహారాన్ని తిన్న విద్యార్థులు కడుపునొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యలు, వాంతులు, విరేచ నాలతో బాధపడాల్సి వస్తోంది.

సెకండ్ క్వాలిటీ ఐటెమ్స్‌తో వంట

జిల్లాలో 20 కేజీబీవీ స్కూళ్లు/కాలేజీలు ఉన్నాయి. వీటిలో ఒక్కో దాంట్లో సగటున 200 నుంచి 360 మంది చొప్పున మొత్తం 5,400 మంది విద్యార్థులు చదువుతున్నారు. మెజార్టీ వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముక్కిన బియ్యం.. రాళ్లు.. ముద్ద కట్టిన అన్నం.. పుచ్చిపోయిన కాయగూరలు.. నీళ్లచారు.. పప్పు, నూనె, మసాల దినుసులు.. వాడిపోయిన ఆకుకూరలు, పుచ్చిపోయిన ఆలు, టమోటా, వంకాయ, ఇతర కూరగాయలు ఇలా అన్నీ నాణ్యత లేనివే వాడుతున్నారు. ఇలాంటి వంట తినలేకపోతున్నామంటూ విద్యార్థులు వాపోతున్నారు. గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తున్నాయని, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నామని చెబుతున్నారు.

పదిసార్లు ఫుడ్ పాయిజన్

ఫరూఖ్‌నగర్ మొగిలిగిద్ద కేజీబీవీలో నాతో పాటు 360 మంది చదువుతున్నారు. అల్పాహారంలో రైస్, మిర్చీ పౌడర్ వడ్డిస్తున్నారు. ఒక్కో తరగతిలో 40 మంది ఉంటున్నారు. అందరికీ కలిపి ఒకటే మంచినీళ్ల బాటిల్ ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉన్న నీటితోనే అడ్జెస్ట్ చేసుకోవాల్సి వస్తోంది. కారం పొడి తినడం ద్వారా కడుపునొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. నాతో పాటు మరో 20 మంది అస్వస్థతకు గురయ్యారు. కేవలం తొమ్మిది నెలల్లో పదిసార్లు ఫుడ్ పాయిజన్ అయింది.

– శ్రావణి, ఫస్టియర్, ఇంటర్మీడియెట్



హాస్టల్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈఓ సుశీందర్‌రావు

కేజీబీవీలో విద్యార్థినులకు అస్వస్థత

- తలనొప్పి జ్వరం, దగ్గు, జలుబు, వాంతులు
- ఆస్పత్రుల్లో చికిత్స
- తల్లిదండ్రుల్లో గుబులు

మంచాల: కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో మొత్తం 252 మంది బాలికలు చదువుకుంటున్నారు. ప్రస్తుతం 215 మంది ఉన్నారు. మంగళవారం రాత్రి పదో తరగతికి చెందిన హాసిని, హేమలత, ఎనిమిదో తరగతి విద్యార్థిని మాధవి వాంతులు చేసుకున్నారు. దీంతో వెంటనే వారికి స్థానిక వైద్యశాలలో చికిత్స చేయించారు. తిరిగి హాస్టల్‌కు తీసుకురాగానే జ్వరం,దగ్గు, జలుబుతో మరింత అస్వస్థతకు గురయ్యారు. వారితో పాటు మరో ఏడుగురు బాలికలు సైతం తలనొప్పి, జ్వరాలతో బాధపడ్డారు. స్థానిక పోలీసుల సాయంతో 108 అంబులెన్స్‌లో అదే రాత్రి ఇబ్రహీంపట్నంలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం హాస్టల్‌కు తీసుకొచ్చారు. మాధవి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి తీసుకెళ్లారు. కాగా, హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కావడంతోనే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎస్ఎస్‌యూఐ, బీఎస్పీ నాయకులు బుధవారం హాస్టల్ ఎదుట ఆందోళనకు దిగారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు నాణ్యమైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

హాస్టల్‌ను సందర్శించిన డీఈఓ

జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు హాస్టల్‌ను సందర్శించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మరోవైపు హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్ అయిందని, విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారనే విషయం మీడియాలో రావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, కస్తూర్బా గిరిజన బాలికల హాస్టల్ ప్రిన్సిపాల్ శ్రీలతా రెడ్డి మాట్లాడుతూ.. వైరల్ ఫీవర్ వచ్చి విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని స్పష్టం చేశారు.

పండిట్, పీఈటీలకు పదోన్నతి కల్పించాలి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎస్టీయూ నేతలు

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్

ఇబ్రహీంపట్నం: ప్రస్తుత షెడ్యూల్‌లోనే పండిట్, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాయపోల్, దండుమైలారం, నాగన్‌పల్లి, పొల్కంపల్లి, నల్లకంచె గురుకుల కళాశాల, కేజీబీవీ, మోడల్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తున్న ఎస్టీయూ అధికారిక అభ్యర్థి భుజంగరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల ఓట్లతో గెలిచి వారి సమస్యలను గాలికొదిలేసిన ఎమ్మెల్సీలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ధనార్జనే ధ్యేయంగా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, నరసింహారావు, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, తిరుమలేశ్, మహేశ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన సువర్ణావకాశం

- పోస్టల్ శాఖ హైదరాబాద్ ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సావిత్రి

అబ్దుల్లాపూర్‌మెట్ : అమ్మాయిల కోసం పోస్టల్‌శాఖ ద్వారా ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం మంచి అవకాశమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ హైదరాబాద్ ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సావిత్రి కోరారు. పెద్దఅంబర్‌పేటలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోస్టల్ శాఖ అమృత్ పెక్స్–2023లో భాగంగా ఈనెల 9, 10 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న జాతీయస్థాయి స్టాంపుల ప్రదర్శనతో పాటు సుకన్య సమృద్ధి యోజనపై ప్రత్యేక కార్యక్రమాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పదేళ్ల లోపు ఆడపిల్లల తల్లిదండ్రులు ఈ అద్భుత అవకాశాన్ని ఉపయోగించుకొని బాలికల బంగారు భవిష్యత్తుకి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. పోస్టాఫీసుల్లో కేవలం రూ. 250కు ఈ ఖాతా తీసుకోవచ్చని, బాలికల బర్త్ సర్టిఫికెట్‌తోపాటు తల్లి లేదా తండ్రి ఆధార్, పాన్‌కార్డు తీసుకొని దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించి కొత్త అకౌంట్లు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట సబ్ పోస్ట్ ఆఫీస్ ఎస్‌పీఎం మణికంఠ, ఈస్ట్ సబ్ డివిజన్ తూర్పాటి ధన్ రాజ్, ఏబీపీఎంలు బాబు నాయక్, ప్రభాకర్, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న పోస్టల్ సిబ్బంది

జాతీయ పునఃనిర్మాణమే లక్ష్యం

- గ్రేటర్ హైదరాబాద్ సంభాగ్ ప్రముఖ్ రామకృష్ణ

ఇబ్రహీంపట్నం: జాతీయ పునఃనిర్మాణమే ఏబీవీపీ లక్ష్యమని గ్రేటర్ హైదరాబాద్ సంభాగ్ ప్రముఖ్ డా. రామకృష్ణ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో జిల్లా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాడడంతోపాటు సమాజసేవలోనూ ఏబీవీపీ ముందుంటుందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను అంతం చేసే దిశగా పని చేయాలన్నారు. ఏబీవీపీ వర్కింగ్ కమిటీ సభ్యుడు జీవన్ మాట్లాడుతూ.. విద్యారంగ, విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మరో ఉద్యమం చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయి చరణ్, శ్రీరామ్, సూర్యప్రకాశ్, వంగ సంజీవరెడ్డి, శశిధర్‌రెడ్డి, శివకృష్ణ, శ్రీకాంత్, భరత్, వందన శివాని, మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సంభాగ్ ప్రముఖ్ రామకృష్ణ

పౌర పఠన మందిరాల ఏర్పాటుకు చర్యలు

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్

బడంగ్‌పేట్: పౌర పఠన మందిరాల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. బడంగ్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో బుధవారం జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యాశాఖమంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో గ్రంథాలయాల సేవలను పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా గ్రంథాలయంలో తలపెట్టిన పౌర పఠన మందిరాల (పబ్లిక్ రీడింగ్ రూమ్స్) పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని పెద్ద మండలాల్లో ఉన్న రెండు పెద్ద గ్రామాలను ఎంపిక చేసి మొదటి దశలో పౌర పఠన గ్రంథాలయాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు కావాల్సిన స్టడీ మెటీరియల్ పఠన మందిరంలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లైబ్రరీలను ప్రజలు, నిరుద్యోగ యువత, విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయ రాష్ట్ర సంచాలకుడు ఎస్.శ్రీనివాస్‌చారి, ఉప సంచాలకుడు శ్రీహరి శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, కుమార్‌గౌడ్, సత్యనారాయణ, జైహింద్, విక్రం, శ్రీనివాస్, దక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

శాంతిభద్రతలతోనే ఆర్థికాభివృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: శాంతిభద్రతలతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అభిప్రాయపడ్డారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో నిర్వహించిన హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. నార్కోటిక్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలు కేవలం తెలంగాణలో మాత్రమే ఉన్నాయని, వీటి కోసం ప్రభుత్వం 4000 మంది అదనపు సిబ్బందిని కేటాయించిందన్నారు. హెచ్‌సీఎస్‌సీ కార్యకలాపాలను మరింత విస్తృతపరచడానికి ఆయా సంస్థలు సీఎస్సార్‌ను పెంచాలని సూచించారు. సమావేశం సందర్భంగా ఆనంద్ మహిళల భద్రత, సైబర్ సెక్యూరిటీ అంశాలపై అవగాహన కల్పిస్తూ హెచ్‌సీఎస్‌సీ రూపొందించిన వీడియోలను విడుదల చేశారు. అదనపు సీపీలు జి.సుధీర్‌బాబు, ఏఆర్ శ్రీనివాస్, సంయుక్త సీపీ డాక్టర్ గజరావ్ భూపాల్, డీసీపీ స్నేహ మెహ్రా పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం

జీడిమెట్ల: జీడిమెట్లలోని శోధన ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఓ కార్మికుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జీడిమెట్ల సీఐ పవన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి 10.30 గంటలకు పరిశ్రమలోని ఫార్మా విభాగంలో సాయిబాబానగర్‌కు చెందిన మేఘనాథ్ (36), జయదేవ్ దలాయి, శశిధర్ పని చేస్తున్నారు. గదిలో ఉన్న ట్యాంకులో రసాయనంతో పాటు పౌడర్ పోస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పౌడర్ ఎక్కువ మోతాదులో పడటంతో మిరుగులు వెలువడి ఒక్కసారిగా మంటలు లేచాయి. మేఘనాథ్, జయదేవ్ దలాయి, శశిధర్ గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మేఘనాథ్ మృతిచెందాడు.

మెట్రో ఓసీసీపై మూసీ పంజా

ఆపరేషన్ కంట్రోల్ కేంద్రంపై కాలుష్య ప్రభావం

- ఉప్పల్ డిపోకు ఆనుకొని వెళ్తున్న నదీ ప్రవాహం
- ఘాటు వాసనలతో సాంకేతిక వ్యవస్థకు దెబ్బ
- పట్టాలపై తరచూ నిలిచిపోతున్న మెట్రో రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: నగర మెట్రోపై మూసీ కాలుష్యం పంజా విసురుతోంది. ఎల్బీనగర్–మియాపూర్, జేబీఎస్–ఎంజీబీఎస్, నాగోల్–రాయదుర్గం మూడు మార్గాల్లో పరుగులు తీసే మెట్రో రైళ్లను నియంత్రించే ఉప్పల్‌లోని ఆపరేషన్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీ)కు మూసీ కాలుష్యం పొగబెడుతోంది. బల్క్‌డ్రగ్, ఫార్మా కంపెనీల వ్యర్థ జలాలు ప్రవహిస్తున్న మూసీ నది నుంచి తరచూ వెలువడుతున్న ఘాటైన వాసనలు ఈ కేంద్రంలోని సున్నితమైన ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్, కంప్యూటర్ ఆధారిత సేవలను దెబ్బతీస్తున్నాయి. ఈ కాలుష్యం కారణంగా ఓసీసీ కేంద్రంలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిణామంతో కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ వ్యవస్థ దెబ్బతింటోంది. దీంతో పట్టాలపై ఉన్నపళంగా మెట్రో రైళ్లు నిలిచిపోతున్నాయి. ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మెట్రో అధికారులు సైతం తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండడంతో తల పట్టుకుంటున్నారు.

- ఉప్పల్‌లో సుమారు 104 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో మెట్రో డిపోను, ఓసీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ ప్రాంగణంలో రైళ్లను నిత్యం శుభ్రపరచడం, రైళ్ల గమనాన్ని నియంత్రించడం, తరచూ తలెత్తే సమస్యలు, ఇతర నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నారు. దీనిపై మెట్రో నిర్మాణ, నిర్వహణ సంస్థ ఎల్‌అండ్‌టీతో పాటు హైదరాబాద్ మెట్రో రైలు ఉన్నతాధికారులను సంప్రదించగా.. ఈ అంశంపై మాట్లాడేందుకు వారు నిరాకరించడం గమనార్హం.



పరిష్కారమిదే..

నగరంలో బాపూఘాట్– ప్రతాపసింగారం (44 కి.మీ)మార్గంలో మూసీ నదిలో బల్క్‌డ్రగ్, ఫార్మా వ్యర్థాలు అత్యధికంగా చేరుతున్నాయి. ప్రధానంగా కూకట్‌పల్లి నాలా నుంచి నిత్యం సుమారు 400 మిలియన్ లీటర్ల మేర హానికారక రసాయనాలు కలిసిన వ్యర్థజలాలు మూసీలో కలుస్తుండడంతో తరచూ ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం జలమండలి వ్యర్థజలాల్లోని మురుగు,ప్లాస్టిక్ ఇతర ఘన వ్యర్థాలను పలు ఎస్టీపీల్లో తొలగిస్తోంది. కానీ రసాయనాలను తొలగించేందుకు ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను మూసీ ప్రవాహ మార్గంలో నిర్మించాల్సి ఉంది. ఈటీపీల్లో శుద్ధి చేసిన తరవాతనే నాలా నీరు మూసీలోకి చేరే ఏర్పాట్లు చేస్తే కాలుష్యం గణనీయంగా తగ్గుముఖం పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు మెట్రో రైళ్ల గమనానికి వినియోగిస్తున్న కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్‌కంట్రోల్ వ్యవస్థను మన నగర వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మెట్రో అధికారులు మార్పులు చేర్పులు చేయాల్సి ఉందని స్పష్టం చేస్తున్నారు.

ప్రజల కోసమే ప్రగతి నివేదన పాదయాత్ర



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని హామీ

మంచాల: ప్రజల కోసమే ప్రగతి నివేదన పాదయాత్ర చేస్తున్నామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధ వారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన ప్రగతి నివేదన పాదయాత్ర బహిరంగ సభకు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో బలహీన వర్గాలకు సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేశారని తెలిపారు. అర్హులందరికీ డబుల్ ఇళ్లు ఇస్తామన్నారు. రూ. 90 వేల లోపు పంట రుణాల న్నీ మాఫీ చేస్తామన్నారు. ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గ్రామాల్లో ఎనిమిదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడానికే ప్రగతి నివేదన పాదయాత్ర చేయడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. భవిష్యత్‌లో నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని పేర్కొన్నారు. ఆరుట్ల గ్రామంలో కోట్లాది రూపాయాలు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేయడం జ రిగిందన్నారు. ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు ఉచితంగా భోజన వసతి కల్పించి వివిధ ఉపాధి రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇప్పటికే వందలాది మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. తాళ్లపల్లి గూడ గ్రామంలో 400 ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఇప్పటికే పరిశ్రమల కోసం భూములను పరిశీలించడం జరిగింద న్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, మండల అధ్యక్షుడు చీరాల ర మేష్, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, డీసీ సీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, ఎంపీపీ నర్మద, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి బహుదూర్, నాయకులు పున్నం రాము, మహేందర్, సిఖిందర్‌రెడ్డి, రవి, వెంకటేష్, శ్రీశైలం, శేఖర్, జంగయ్య, వినోద్, సురేష్, ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా



ప్రమాదానికి గురైన ఆటో

కడ్తాల్: ఆటో అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన మండలంలోని మక్తమాధారం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన ముగ్గురు యువకులు, వ్యక్తిగత పనిమీద ఆటోలో కడ్తాల్‌కు వచ్చి, తిరిగి వెళుతుండగా మార్గ మధ్యలో మక్తమాధారం వద్ద ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టి పొలాల్లోకి దూసుకెళ్లింది. యువకులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

నందిగామ: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కుంటలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని బుధవారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై గోపాల్ కథనం ప్రకారం.. మేకగూడ గ్రామానికి చెందిన బండారు భిక్షపతి(43) ఈ నెల 4న ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా బయటికి వెళ్లాడు. గతంలో కూడా ఇలాగే చేసేవాడు. రెండు, మూడు రోజుల తరువాత ఇంటికి వచ్చేవాడు. ఈ సారి కూడా వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. అయితే బుధవారం గ్రామ శివారులోని చిరుటని కుంటలో ఓ వ్యక్తి మృతదేహం ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్సై గోపాల్ కుంట వద్దకు చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు భిక్షపతిగా గుర్తించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గోపాల్ తెలిపారు.



కుంటలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



వేద డిగ్రీ కాలేజ్ జట్టు



లయోలా కాలేజ్ జట్టు



ఇబ్రహీంపట్నం శ్రీ ఇందు కాలేజ్ జట్టు

రసవత్తరంగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ పోటీలు

ఘట్‌కేసర్: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్-4 (ఎస్‌పీఎల్) మ్యాచ్‌లు బుధవారం రసవత్తరంగా సాగాయి. ఈ లీగ్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 65 జట్లు పోటీపడుతున్నాయి.

విజేతల వివరాలు...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-1

- మొదటి మ్యాచ్‌లో లయోలా డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనురాగ్ యూనివర్సిటీ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసి ఓటమి పాలైంది. లయోలా క్రీడాకారుడు లోకేశ్ 33 బంతుల్లో 95 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.
- రెండవ మ్యాచ్‌లో వసుంధర డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసి గెలుపొందింది. విజ్ఞాన భారతి కళాశాల క్రీడాకారుడు కౌస్తుబ్ 16 బంతుల్లో 32 పరుగులు చేశాడు.
- మూడవ మ్యాచ్‌లో ఎస్వీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రేయ ఇంజినీరింగ్ కళాశాల-బి జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసి ఓడింది. ఎస్వీ కాలేజ్ క్రీడాకారుడు వినిక్ 33 బంతుల్లో 66 పరుగులు చేశాడు.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-2

- మొదటి మ్యాచ్‌లో ముఫకంజా జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన వేద డిగ్రీ కాలేజ్-బి జట్టు 7.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసి గెలుపొందింది.
- రెండో మ్యాచ్‌లో సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 7.1 ఓవర్లలో ఆలౌట్‌తో 43 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ జట్టు 6.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 46 పరుగులు చేసి గెలుపొందింది.
- మూడవ మ్యాచ్‌లో శ్రీ ఇందు ఇంజినీరింగ్ కళాశాల-ఎ జట్టు 10 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల-సీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసి ఓడిపోయింది. శ్రీ ఇందు క్రీడాకారుడు గౌతమ్ 15 బంతుల్లో 32 పరుగులు చేశాడు.

'ఫ్రీడమ్' ఆధ్వర్యంలో పకోడా పార్టీ



సాక్షి, సిటీబ్యూరో: ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ ఆధ్వర్యంలో సలార్‌పురియా సత్వా నాలెడ్జ్ సిటీ వద్ద ఫ్రీడమ్ పకోడా పార్టీ కార్యక్రమం నిర్వహించారు. నాలెడ్జ్ సిటీ వద్ద పనిచేస్తున్న ఉద్యోగులు ఫ్రీడమ్ ఆయిల్ స్టాల్‌ను సందర్శించేలా ప్రోత్సహించడంతో పాటుగా ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌తో వండిన రుచికరమైన స్నాక్స్‌ను ఆస్వాదించేలా చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహకులు వెల్లడించారు. అలాగే ఐటీ ఉద్యోగులు, యువతను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి...వారిని కొన్ని ప్రశ్నలు అడిగి...సరైన సమాధానాలిచ్చిన వారికి ఫ్రీడమ్ గుడీ బ్యాగ్‌ను బహుమతిగా అందించారు. ఫిబ్రవరి 12న గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించనున్న 'రన్ ఫర్ ఏ గాళ్ చైల్డ్' పట్ల అవగాహన కూడా కల్పించారు. ఈ సందర్భంగా ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ సేల్స్ అండ్ మార్కెటింగ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ 'ఈ పకోడా పార్టీ ద్వారా ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్‌తో వండిన స్నాక్స్ రుచి చూసే అవకాశం కూడా కల్పించాం. ఫ్రీడమ్ రైస్ బ్రాన్ ఆయిల్ ఆరోగ్యానికి ఎంతో మంచిదని' వివరించారు.

గౌడలు రాజకీయంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేందర్ గౌడ్

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేందర్ గౌడ్

శంకర్‌పల్లి: గౌడ కులస్తులు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేందర్‌గౌడ్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి అతిథి గృహంలో మండల గౌడ కులస్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శకర్‌పల్లి మున్సిపల్ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జీ రాజేష్‌గౌడ్, మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీలు ఐక్యతతో ఉండాలన్నారు. రాష్ట్రంలో బీసీల ఐక్యత కోసం గౌడ, రైతు, బీసీ సంఘాలను రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సంఘాలను బలోపేతం చేసుకొని రాజకీయంగా ముందుకు రావాలని సూచించారు. సీఎం కేసీఆర్ గౌడలను అన్ని రకాలుగా ఆదుకోవడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వాలు హైదరాబాద్ నగరంలో కల్లు దుకాణాలను మూసివేస్తే.. సీఎం వాటిని నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించారని తెలిపారు. కల్లు, గీత కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, నాయకులు కాశీనాథ్‌గౌడ్, రాములుగౌడ్, రాజేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్



వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దామోదర్

చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎహెచ్‌ఓ దామోదర్ సిబ్బందికి ఆదేశించా రు. బుధవారం డివిజన్‌లోని వైద్యాధికారులు, సూ పర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గర్భిణుల వివరాల నమోదు చేయాలన్నారు. అలాగే సుఖ ప్రసవం గురించి అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించాలని సూచించారు. ప్రసవాల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోరాదని ప్రజలు వివరించాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు, పరీక్షలు ఉచితంగా అందిస్తున్నట్లు నమ్మకం కలిగించాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. శిబిరాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఓలు సుదర్శన్, బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

మొయినాబాద్: వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ప్రహరీని ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కనకమామిడి గేటు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన ముంగె వీరన్న(33), జంశత్‌పూర్‌కు చెందిన గొల్ల మల్లేశం, మేనపల్లికి చెందిన కంతల కిష్టయ్య బుధవారం వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నారు. కారు మొయినాబాద్ మండలం కనకమామిడి గేటు వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కకు ఉన్న ప్రహరీని ఢీకొట్టింది. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరన్న బుధవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

యువకుడి దుర్మరణం

తలకొండపల్లి: మండల పరిధిలోని జూలపల్లికి చెందిన ఎంబీఏ విద్యార్థి మణికంఠ (25) నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మణికంఠ బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి సంధ్య ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, తండ్రి నాగులపల్లి రాజేందర్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. మృతదేహాన్ని బుధవారం జూలపల్లికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మా సత్యం జూలపల్లికి చేరుకొని మణికంఠ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ అలివేలు, విజయ్‌రెడ్డి, ఉప సర్పంచ్ అజీజ్ తదితరులు మృతదేహానికి నివాళి అర్పించారు.

వృద్ధురాలి మృతి

చౌటుప్పల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు దుర్మరణం చెందింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన గుత్తికొండ రాజాలు(60) చౌటుప్పల్ వైపునకు వెళ్లేందుకు తూప్రాన్‌పేట గ్రామ శివారులో జాతీయ రహదారి దాటుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఆమెను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీత పాండు తెలిపారు.

బాలిక ఆచూకీ లభ్యం

- 24 గంటల్లోగా కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



మనీషాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కడ్తాల్: కనిపించకుండా పోయిన బాలికను 24 గంటల్లో కుటుంబ సభ్యులకు అప్పగించారు కడ్తాల్ పోలీసులు.. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన గురిగళ్ల మనీషా(16), తల్లితో గొడవపడి మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, ఆమనగల్లు సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ శ్యాంసన్, రమేశ్‌లు బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో అదృశ్యమైన మనీషా సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లినట్లు గుర్తించారు. వెస్ట్‌జోన్ తిరుపతి పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడి పోలీసులు బాలికను గుర్తించి స్టేషన్‌కు తీసుకువెళ్లారు. కడ్తాల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తిరుపతి వెళ్లి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. 24 గంటల్లోనే బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించిన ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, కానిస్టేబుల్ రమేశ్, శ్యాంసన్‌లను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.